# తప్పు చెబితే..

బోడపాటి రమేష్

వాల్‌క్లాక్‌లో పదిగంటలయింది. బ్యాటరీ అయిపోవచ్చిందేమో గంటలు కొట్టిన శబ్దం జీరగా వస్తోంది. అప్పుడే ఆఫీసు ఆవరణలో అడుగుపెడుతున్న స్కూటర్లు, మోపెడ్ల శబ్దాలలో అది కలిసిపోయింది.

ఆఫీస్‌లో అడుగుపెట్టిన పరాంకుశం తిన్నగా తన ఛాంబర్‌లోకి వెళ్ళిపోయాడు తల దించుకుని. తల ఎత్తి చూస్తే ఖాళీ కుర్చీలు స్వాగతం పలుకుతాయి. అధికారి వచ్చిన తర్వాతే కార్యాలయంలో అడుగుపెట్టడం అక్కడి ఉద్యోగులకు రివాజు. వీళ్ళు వచ్చేసరికి ఆఫీసరు రాకపోతే ఒక్కొక్కళ్ళకు కంపరంగా గంగ వెర్రులెత్తినట్లుగా వుంటుంది. ఏ కారణం చేతనైనా పరాంకుశం ఆఫీసుకు రాకపోతే ఎవరికి వారు 'ఎవరి కోసం, ఎవరి కోసం ఈ ఫైలు తీయడం, ఈ నోటు రాయడం ఎవరి కోసం, ఎవరికోసం' అని పాడుకోడం కద్దు.

కానీ ఇటువంటి తులసీవనంలో గంజాయి మొక్కలాగా ముక్కుకు సూటిగా తన పని తను చేసుకుపోయే వ్యక్తి ఒకడున్నాడు. అతని పేరు సుధీర్.

పేరులోనే కాక వ్యక్తిత్వంలోనూ ధీరుడే. అయితే సుధీర్ జీవితంలో చేసిన పొరపాటు ఒకటుంది. చదువుకు, ఉద్యోగానికీ పొంతనలేని ఈ రోజుల్లో అతను పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి దానికి తగ్గ ఉద్యోగం తెచ్చుకోలేక ఈ ఆఫీసులో గుమస్తాగా స్థిరపడ్డాడు.

అయితే ఇంగువ కట్టిన గుడ్డ వాసన పోగొట్టుకోనట్లుగా తన చదువు తెచ్చిన లోకజ్ఞానంతో ఆఫీసు విషయాల్లో తనకు తోచిన సలహాలు ఇస్తుంటాడు. అది సహజంగానే ఇంటర్మీడియెట్ స్థాయి ఉద్యోగులకు నచ్చదు. ముఖ్యంగా పరాంకుశం వంటి పైఅధికారులకి.

వీళ్ళిద్దరి మధ్య సఖ్యత లేకపోవడం తోటి ఉద్యోగులకు పండగ్గా వుంటుంది. పరాంకుశం తన ఛాంబర్‌లోకి వెడుతుండడం చూసి అప్పటివరకూ గేటు బయట స్టూలుమీద కూర్చుని పుస్తకాలు తిరగేస్తున్న ప్యూన్ నారాయణ లేచీ లేవకుండా లేచి, పెట్టీ పెట్టని నమస్కారం ఒకటి పెట్టి మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు.

''సుధీర్ వచ్చాడా?'' అన్నాడు పరాంకుశం.

''కనబడలేదు సార్'' అన్నాడు నారాయణ.

ఎందుకంటే అతను ఇంతవరకూ పుస్తక పఠనంలో ఉన్నాడు. విశేషమేమిటంటే పరాంకుశం మిగతా వాళ్ళ గురించి అడగడు. అడిగి ఉపయోగం లేదని తెలుసుకున్న జ్ఞాని అతను. వస్తే వాళ్ళే వచ్చి కనబడతారు. కానీ సుధీర్ వచ్చిన తర్వాత కూడా ఏదయినా పని వుంటే తప్పించి కనబడడు. అదీ పరాంకుశం అక్కసుకు అసలు కారణం.

''ఆయనకు మనమెక్కడ కనిపిస్తాం?''

''పిలవమంటారా సార్!''

''ఊ!''

''ఏమండీ. ఇప్పుడా ఆఫీసుకు రావడం. ఇప్పుడు టైం ఎంతయిందో తెలుసా? ఇంత చిన్న వయసులోనే నిర్లక్ష్యంగా వుంటే ముందు ముందు వృద్ధిలోకి రావడం చాలా కష్టం'' అన్నాడు తన గదిలోకి వచ్చిన సుధీర్‌ను చూస్తూనే. పరాంకుశం వాక్ప్రవాహం ఆగడంలేదు.

''నేను వచ్చి చాలాసేపయింది సార్. నారాయణ వచ్చి తాళం తీసేవరకూ మెట్లమీదనే కూర్చున్నాను. కదూ నారాయణా!''

నారాయణ గతుక్కుమన్నాడు.

''సర్లే. పిల్లికి ఎలుక సాక్ష్యంట. నేను చెప్పిన స్టేట్‌మెంట్ ఎంతవరకూ వచ్చింది?''

''ఇదిగోండి సార్. మీరు చెప్పినట్లుగా వివరాలు తీసాను. కానీ సార్... ఇదే ఇన్‌ఫర్మేషన్ ఇంకొక రకంగా కూడా తీయవచ్చనిపించింది. ఇంకా తేలిగ్గా అర్థమవుతుంది'' అంటూ రెండురకాలుగా తయారుచేసిన స్టేట్‌మెంట్ వివరాలు చూపించాడు.

సుధీర్ ముఖంలో తను ఇంతవరకూ పడ్డ కష్టానికి, తన తెలివికి తగిన గుర్తింపు లభిస్తుందనే ఆశ, ఆఫీసర్ తనని మెచ్చుకుంటాడని ఊహించుకుని కలిగే ఆనందం అన్నీ కనిపిస్తున్నాయి.

చిరాకువేసింది పరాంకుశానికి.

''నేను చెప్పిన పని చెప్పినట్లుగా చేయడమే మీ పని. అంతేగానీ ఈ పని ఎట్లా చేస్తే బావుంటుందో అని రిసెర్చ్ చేసి టైం వేస్ట్ చేయడం కాదు'' అంటూ సుధీర్ చేతుల్లోంచి కాగితాలు లాక్కున్నాడు.



సుధీర్ చిన్నబుచ్చుకున్నాడు. అతనికి ఛీత్కారాలు ఎక్కువయి క్రమేపీ అలవాటు పడుతున్నాడు.

తప్పదు మరి.

సొంత ఊర్లో ఉద్యోగం. ఇంకోచోట మాత్రం ఇటువంటి ఆఫీసర్లు వుండరని చెప్పలేం కదా.

పరాంకుశం చెప్పినట్లుగానే రిపోర్టు తయారుచేసి పంపించాడు.

కానీ కొద్దిరోజుల్లోనే హెడ్డాఫీసు నుండి ఒక కాగితం వచ్చింది. దాని సారాంశం పరాంకుశం పంపిన వివరాలు సరిగ్గా లేవని, వేరేరకంగా పంపమని.

అది చూసిన సుధీర్–

''చూసారా సార్! మనం మొదట అనుకున్న విధంగానే వీళ్ళు కూడా అడిగారు'' అన్నాడు నవ్వుతూ.

అయితే పరాంకుశం ఉడుక్కున్నాడు.

''ఛాల్లే. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందని... ఇన్నేళ్ళు బట్టీ ఉద్యోగం చేస్తున్న నాకు ఏ రిపోర్టు ఎలా పంపాలో హెడ్డాఫీసులో కుర్ర వెధవ దగ్గర నేర్చుకోవాల్సి వచ్చింది. దానికి నీ వత్తాసొకటి?''

''సారీ సార్'' అంటూ బయటకొచ్చి నవ్వుకున్నాడు సుధీర్. సుధీర్ పైఅధికారులు చెప్పినట్లుగానే తనకు అప్పజెప్పిన పనులు చేయడం అలవాటు చేసుకున్నాడు. అతనికి మనస్కరించకపోయినా ఆఫీసులో ఎటువంటి గొడవలకూ ఆస్కారం ఉండడంలేదు.

రోజులు ఒకేలాగా ఉండవు కదా.

ఇంకొకసారి హెడ్డాఫీసు నుండి ఫోన్ వచ్చింది. వాళ్ళు పంపిన రిపోర్టు ఏ రకంగానూ సరిగ్గాలేదని. మళ్ళీ పరాంకుశం సుధీర్ పాలపడ్డాడు.

''ఏంటయ్యా ఇది?'' సుధీర్ పంపిన కాగితాలను విసిరేసాడు పరాంకుశం.

''మీరు చెప్పినట్లుగానే తయారుచేసాను సార్.''

''అంటే?''

''అంటే ఏం లేదండీ. మనం ఇన్నాళ్ళుగానూ ఎట్లా పంపిస్తున్నామో అట్లానే పంపానండీ. అందులో తప్పులున్నాయని నాకు తెలుసండి. కానీ పెద్దవారు మీకు ఎదురు చెప్పడం బాగుండదని...'

''అయితే నేను చెప్పినట్లుగానే చేస్తావన్నమాట. చదువుకున్నవాడివి నీ తెలివి ఏమయింది? ఏమయినా తప్పనిపిస్తే నాకు చెబితే కాదన్నానా. అనవసరంగా నీవల్ల హెడ్డాఫీసు నుండి మాట పడవలసి వచ్చింది. మన పరువు తీసావు'' విసుక్కున్నాడు పరాంకుశం.

సుధీర్ నవ్వాడు.

★